శాస్త్రీయ పద్ధతిలో వ్యవసాయం చేయాలి

ప్రజాశక్తి-కందుకూరు: మండలంలోని మోపాడు గ్రామంలో మెలైన వ్యవసాయ సాగు పద్ధతులు, పొలంబడి కార్యక్రమం మండల వ్యవసాయాధికారి వి రాము ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ రైతులు వ్యవసాయాన్ని శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సూచనల మేరకు సాగు చేసుకోవాలని రైతును శాస్త్రవేత్తగా చేయడమే దీని ఉద్దేశమని తెలిపారు. మోపాడు గ్రామ పరిధిలో వరి రకం ఆర్ ఎన్ ఆర్ 1638 నారుమడి, నాట్లు వేస్తున్నారని, కావున రైతులు నారు నాటే వారం రోజుల ముందు నారుమడిలో ఒక సెంటు లో 160గ్రాముల కర్బొఫ్యూరన్ 3జి గుళికలు వేసుకొని నాటుకొనినచో మోము పిప్పి పురుగు, ఉల్లికోడు నుండి కాపాడుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మాయాంక్, మోపాడు గ్రామ వ్యవసాయ సహాయకులు ఇ.రమణయ్య, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అధికారి

సాగునీరు సద్వినియోగం చేసుకోండి

సోమశిల, కండలేరు ప్రాజెక్టు పరిధిలోని తొలి పంటకు 7.77 లక్షల ఎకరాలకు సాగు నీరు అందివ్వాలని, సాగునీరు వృథా కాకుండా రైతులు సద్వినియోగం చేసుకో వాలని ఇరిగేషన్ అడ్వయిజరీ బోర్డు (ఐఎబి) సమావేశంలో ప్రజాప్రతినిధులు, తీర్మానించారు. కాలువల్లోని పూడికలు తీయించడంతో పాటు, కాలువలపై ఉన్న ఆక్రమణలు తొలగించడానికి చర్యలు తీసుకోవాలని, సోమశిల హైలెవల్ కెనాల్ పనులు ప్రారంభించాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు మాత్రమే కూర్చొని మాట్లాడుకున్నారు. మీడియాను సమావేశంలోకి అనుమతించలేదు. ఇందులో రహస్యం ఏమిటో అర్థం కాలేదు

ఐఎబి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

- 7.77 లక్షల ఎకరాలకు నీరు
- కాలువలపై ఆక్రమణలు తొలగించాలి
- ఐఎబిలో తీర్మానం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

. ఇరిగేషన్ అడ్వయిజరీ బోర్డు (ఐఎబి) సమావేశం కలెక్టర్ ఒ. ఆనంద్ అధ్యక్షతన కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో నిర్వహించారు. మంత్రి పి. నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గత ప్రభుత్వం చేసిన తప్పు వల్ల 30 టిఎంసిలు వృథాగా ఖర్చుచేశారని, కోట్లాది రూపాయలు రైతులు నష్టపోయారని సమావేశంలో తెలిపారు. నీటిని సద్వినియోగం చేసుకుంటే ఒక్క టిఎంసితో 16 వేల ఎకరాలు పండించవచ్చునని గతంలో పండించి చూపించామని సర్వేపల్లి ఎంఎల్‌ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఇరిగేషన్ శాఖలో ప్రతి నీటి చుక్కను సక్రమంగా వాడుకోవాలంటే లస్కర్లకు పనిచేయాలని వారికి జీతాలు ఇవ్వకుండా పనిచేయమనడం మంచిది కాదన్నారు. వెంటనే వారికి జీతాలు వచ్చేలా చూడాలన్నారు. కేవలం ఇరిగేషన్ అధికారంలే కాకుండా పోలీసం, రెవెన్యూ, వ్యవసాయ అధికారుల బాధ్యత తీసుకొని కాలువపై పర్యవేక్షణ చేయాలన్నారు. కావలి ఎంఎల్‌ఎ కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ కావలి పూర్తిగా సోమశిల నీటిపై ఆధారపడిందని, నీటిని విడుదల చేసి, కాలువలకు పూడిక తీయించాలన్నారు. పెన్నా నది పోర్లు కట్టలు పటిష్టం చేయాలని కోవూరు ఎంఎల్‌ఎ ప్రశాంతిరెడ్డి అన్నారు. కనిగిరి రిజర్వాయర్ కట్టలు బలహీనంగా ఉన్నాయని, గేట్లు మరమ్మతులు చేయించాలన్నారు. సూళ్లూరుపేట ఎంఎల్‌ఎ డాక్టర్ విజయశ్రీ మాట్లాడుతూ బిపిఎస్ సప్లయ్ చానల్ ద్వార 15 చెరువులకు నీటిని పంపాలని, ఆధునికీకరణ చేయించాలని కోరారు. ఎంఎల్‌సి బల్లి కళ్యాణచక్రవర్తి మాట్లాడుతూ స్వర్ణముఖికి 3 టిఎంసిల నీటిని విడుదల చేయాలన్నారు. ఆనంతరం మంత్రి పి. నారాయణ మాట్లాడుతూ సోమశిలలో ప్రస్తుతం 69 టిఎంసిలు, కండలేరులో 49 టిఎంసిలు నీరు ఉందన్నారు. సోమశిల ప్రాజెక్టు కింద 5.51 లక్షల ఎకరాలు, కండలేరు క్రింద 2.26 లక్షల ఎకరాలకు నీరు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. రెండు ప్రాజెక్టుల పరిధిలో 7.77 లక్షల ఎకరాలకు సాగుకు నీరు ఇస్తామన్నారు. కాలువల్లో పూడిక తీయడానికి ఈనెల 11, 18 తేదీల్లో టెండర్లు ఖరారు కానున్నాయని, గతంలో మాదిరి కాకుండా పక్కాగా పనులు చేయాలన్నారు. డ్రోన్లతో పనులు పర్యవేక్షణ చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. సోమశిల హైలెవల్ కెనాల్‌ను సిఎం పరిశీలించారు. ఖజానా ఖాళీగా ఉన్నప్పటికీ సిఎంతో అందరు ప్రజా ప్రతినిధులు మాట్లాడి నిదులు తీసుకొస్తామన్నారు. కాలువలు ఆక్రమణకు గురయ్యాయని, అందుకే బుడమేరు వాగు తెగి భారీగా నష్టపోయారన్నారు. అందుకే కాలువపై ఉన్న ఆక్రమణలను తొలగించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సారి సాగు సక్రమంగా సాగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ సోమిరెడ్డి

మాట్లాడుతున్న మాజీమంత్రి కాకాణి

అవినీతిని బయట పెడతా

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

కనుపూరు కాలువ నిర్వహణ పనులలో ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి భారీ అవినీతికి పాల్పడినట్లు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. కనుపూరు కాలువపై పర్యటించిన ఆయన వెంట పెద్ద సంఖ్యలో ఆ ప్రాంత ప్రజలు పాల్గొన్నారు. కనుపూరు కాలువలో జరిగిన అవినీతిని రైతుల సమావేశంలో, కాకాణి రైతులకు ఆధారాలతో సహా వివరించారు. వైసిపి రైతు విభాగం బచ్చల సురేష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కాకాణి వెంట మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య, మాజీ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షులు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఉన్నారు. సోమిరెడ్డి సర్వేపల్లి నియోజకవర్గంలో విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతూ ప్రశ్నించిన వారిపై పోలీసు కేసులతో బెదిరిస్తున్నారని కాకాణి విమర్శించారు. కనుపూరు కెనాల్ పర్యటనలో పాల్గొన్న రైతులు, వైసిపి నాయకులు, కార్యకర్తలపై సోమిరెడ్డి సూచన మేరకు పోలీసులు కేసులు నమోదు చేయడం దుర్మార్గం అన్నారు. సోమిరెడ్డి అవినీతిపై పోలీసు ఆంక్షలు లెక్కచేయకుండా, కనుపూరు కెనాల్‌పై పర్యటించి, రైతులకు ప్రజలకు సోమిరెడ్డి అవినీతిని బయటపెట్టారన్నారు. సోమిరెడ్డి సూరాయపాళెం రీచ్ లో 100 కోట్ల స్కెచ్ లో భాగంగా, భారీగా గోతులు తవ్వి, ఇసుక ఇతర రాష్ట్రాలకు తరలించడంతో అమాయక గిరిజనులు ప్రాణాలు కోల్పోయారన్నారు. కనుపూరు కాలువపై ధైర్యంగా తనతోపాటు పాల్గొన్న రైతులకు ధన్యవాదాలు తెలిపారు.

ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు : మున్సిపల్ కార్పొరేషన్ ఉపాధ్యాయులకు సంబంధించి ప్రమోషన్స్ ప్రక్రియలో చాలా లోపబూయిష్టంగా ఉన్నాయని మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేసింది. స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ సంబంధించి ఎటువంటి పోస్టులను చూపించలేదన్నారు. ఉర్దూ స్కూల్ అసిస్టెంట్ పోస్టులను కూడా చూపించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంటిఎఫ్ రాష్ట్ర నాయకులు టి లక్ష్మీనారాయణ, టి.సురేష్ బాబు, బి.వెంగళరావు, ఈ ధనరాజ్, మాల్యాద్రి రహీం, రాజారహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలకు పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి-నెల్లూరు: పెండింగ్‌లోని విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలని, విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నగరంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వి.ఆర్. కళాశాల ప్రాంగణం నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థులు నిరసన ప్రదర్శన నిర్వహించి, కలెక్టరేట్ ఎదుట ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సమయంలో విద్యార్థులు అధిక సంఖ్యలో కలెక్టరేట్ లోపలకు వెళ్లి అధికారులను కలసి వినతిపత్రం అందజేసేందుకు ప్రయత్నం చగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సమయంలో విద్యార్థులకు, పోలీసులకు మధ్య ఉద్రిక్త చోటు చేసుకుంది. కలెక్టరేట్ లోపలకు వెళ్లేందుకు కొంది మంది విద్యార్థులకు మాత్రమే అవకాశం కల్పిస్తామని పోలీసులు ప్రకటించడంతో ప్రశాంత వాతావరణం నెలకొంది. అనంతరం డి.ఆర్.ఓ జె.ఉదయ్ భాస్కరరావును కలిసిన విద్యార్థి సంఘం నాయకులు సమస్యలను వివరించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. డి.ఆర్.ఓ స్పందిస్తూ స్థానిక సమస్యలు పరిష్కరిస్తామని, మిగిలిన సమస్యలపై ప్రభుత్వానికి లేఖ రాస్తానని తెలిపారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెన్ను నరేంద్ర, మెండా శ్రీహర్షలు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగంలో ఉన్న సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతున్నప్పటికీ పెండింగ్లో ఉన్న 3,480కోట్ల విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలు పెండింగ్లో ఉన్నాయని వాటిని విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును మంచిగా తీర్చిదిద్దాలన్నారు. తల్లికి వందనం కింద ఇస్తానన్న రూ.15వేలు వెంటనే విడుదల చేయాలని, డిగ్రీ లో మేజర్ మైనర్ విధానాన్ని రద్దు చేయాలని, ఉన్నత విద్యను దూరం చేసే జీవో నెంబర్ 77 రద్దుచేసి పీజీ చదివే విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్మెంట్ వర్తింపచేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమ ంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు, నగర కార్యదర్శి చరణ్, టౌన్ కమిటీ సభ్యులు జీవన్ ,సుమన్ ,చందు, సంతోష్ ,మధు , విష్ణు ,యశ్వంత్, పవన్, ఆత్మకూరు పట్టణ కార్యదర్శి భాష తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గుడ్లూరులో ప్రజాపోరు యాత్ర

ప్రజాశక్తి-గుడ్లూరు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ, ప్రజా సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈనెల8 నుంచి 14వ తేదీ వరకు ఇంటింటా ప్రచార కార్యక్రమం ప్రారంభించారు. గుడ్లూరు లోని ఎమ్మెస్సార్ గిరిజన కాలనీలో ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు, మా పిల్లలు చదువుకోవడానికి ప్రాథమిక పాఠశాల కావాలని, ఇంటి పట్టాలు మంజూరు చేయాలని, గత నెల రోజుల నుండి మంచినీళ్లు రావడం లేదు ఏమో ఎట్లా బతకాలి అని, సిపిఎం ప్రజా పోరుకు వారు విన్నవించారు. ఈ సందర్భంగా సిపిఎం గుడ్లూరు ఏరియా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మనకు ఎన్నికల్లో అనేక వాగ్దానాలు చేశారు. ఆ వాగ్దానాల అమలుకు పూనుకోవడం లేదన్నారు. ఉచితంగా పేదలకు కరెంటు ఇచ్చి తక్కువ ధరకే అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జి.స్టాలిన్, సుంకర విజయలక్ష్మి, దామా కృష్ణయ్య, పాలకుర్తి నాగేశ్వరరావు, కొప్పోలు నారాయణ, రాపూరి మాల్యాద్రి, వర్ధినేని కృష్ణయ్య, రమాదేవి పాల్గొన్నారు.

గుడ్లూరులో ప్రచారం చేస్తున్న దృశ్యం

భగత్‌సింగ్ కాలనీలో కార్డన్ అండ్ సర్చ్

ప్రజాశక్తి-నెల్లూరు: జిల్లాలో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణలో భాగంగా శుక్రవారం నవాబుపేట పరిధిలోని భగత్‌సింగ్ కాలనీ ప్రాంతంలో ఎస్‌పి జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు పోలీసు సిబ్బంది కార్డన్ అండ్ సర్చ్ కార్యక్రమం నిర్వహించారు. నగర డిఎస్‌పి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో ఒక సిఐ, ఇద్దరు ఎస్ఐలు, సిబ్బంది, స్పెషల్ పార్టీ , మరో 35 మంది సిబ్బంది సహాయంతో భగత్‌సింగ్ కాలనీలోని 400 ఇళ్లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 15 బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ నగరంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, దొంగతనాల నివారణ, శాంతి భద్రతలను పరిరక్షణ, అసాంఘీక శక్తుల ఏరివేతే లక్ష్యం ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. జిల్లాలో హింసాత్మక చర్యలు అరికట్టుటకు ప్రణాళికలు చేసినట్లు తెలిపారు.

మాట్లాడుతున్న జెడ్‌పిటిసి సభ్యురాలు ఇంటూరి భారతి

అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి

ప్రజాశక్తి-వలేటివారిపాలెం+ రాజకీయాలు శాశ్వతం కాదు, వస్తాయి పోతాయి. రాజకీయ నాయకులకు భయపడి పేదలకు అన్యాయం చేయకుండా, ప్రతి అధికారి బాధ్యతా యుతంగా పనిచేయాలని జెడ్‌పిటిసి సభ్యురాలు ఇంటూరి భారతి తెలిపారు. స్థానిక మడల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పొనుగోటి మౌనిక అధ్యక్షతన ఎంపీడీఓ నరేంద్రదేవ్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత సమావేశంలో వివిధశాఖల అధికారులు. ఆయా శాఖల్లో అమలవు తున్న ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనతరం జరిగిన సమావేశంలో జెడ్‌పిటిసి భారతి మాట్లాడుతూ బడేవారిపాలెంలోని ఉ పాధి కూలీలకు పనులు ఎందుకు కల్పించడంలేదని ఏపిఓను ప్రశ్నించారు. 18 వారాల నుంచి కూలీలకు పనులు కల్పించకపోడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఉపాది కూలీలలకు అడిగిన వెంటనే పనులు కల్పించాలని, ఉఉన్నతాధికారులు చెబుతుంటే మీరు క్షేత్రస్థాయిల్లో కూలీలకు ఎందుకు పనులు కల్పించడం లేదని ప్రశ్నించారు. ఒకే పనిలో 10 మంది కూలీలకు వేతనం మరో 10 మంది కూలీలకు రూ 1800 వేతనం లభించడం మేమిట న్నారు. అధికారులు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. రాజకీయ నాయకులు మిమ్మలను బదిలీ చేయిస్తారే తప్ప మీ ఉద్యోగం తీసివేయలేరని తెలిపారు. రాజకీయ నాయకులకు భయపడి పేదలకు అన్యాయం చేయకూడదని సూచించారు. బడేవారిపాలెంలో జరుగుతున్న ఉపాధి పనుల్లో అవకతవకలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడ మేమిటని ఎపిఓపై మండిపడ్డారు. పనుల్లో జరుగుతున్న అక్రమాలను గుర్తించలేకపోతే అందరి సమక్షంలో అక్రమాలను బయట పెడతానని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా చర్యలు చేపడితే కొంతమేరైన నివారించొచ్చని తెలిపారు. అనంతరం ఎంపీడీఓ అధ్యక్షురాలు మౌనిక అనుమతితో 2025-26 మండల బడ్జెటును ప్రవేశ పెట్టారు. సభ్యుల చప్పట్లతో ఆమోదించారు. సమావేశంలో ఎంపిటీసీ సభ్యులు చింతలపూడి రవీంద్ర, చౌడబోయిన యానాది, స్వర్ణ నరసింహం, సర్పంచులు డేగా వెంకటేశ్వర్లు, నవ్వులూరి రాజారమేష్, ఆనుమోల అమరేశ్వరి, డిప్యూటీ తహశీల్దార్ నాయబ్‌రసూల్, ఏఓ హేమంత్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శిరీషా, ఎంఇఒ రవికుమార్. వైద్యాధికారి శివశిద్దప్ప, ఏపీఓ ఉమామహేష్, పిఆర్‌ఎఇ వీర శ్రీనివాసులు పాల్గొన్నారు.

టిటిడి బోర్డు సభ్యురాలిగా పనబాక లక్ష్మీ ప్రమాణాస్వీకారం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి + తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యురాలుగా మాజీ కేంద్ర మంత్రి, పనబాక లక్ష్మీ ప్రమాణ స్వీకారం చేశారు. శుక్రవారం తన కుటుంబ సభ్యులు, సన్నిహితులు వెంటరాగ ఆమె దేవాలయంలో టిడిపి అధికారుల సమక్షంలో ప్రమాణా స్వీకారం చేశారు. ఆమెకు ఆలయ మర్యాదలతో సత్కరించారు. టిటిడిలో సామాన్య భక్తులకు మంచి జరిగిలా తన వంతు కృషిచేస్తానని, సిఎం చంద్రబాబు నాయుడు తనకు అప్పగించిన బాధ్యతలకు న్యాయం చేస్తానని తెలిపారు. ఆమె వెంట భర్త పనబాక కృష్ణయ్య, కుమార్తె, అల్లుడు, మనవలు, మాజీ తిరుపతి ఎంఎల్‌ఎ సుగుణమ్మ, టిడిపి తిరుపతి జిల్లా అధ్యక్షులు నరసింహయాదవ్, తెలుగు యువత రాష్ట్ర నాయకులు శివకుమార్, ఆమె వెంట ఉన్నార

విద్యుత్ అధికారులపై సర్పంచులు ధ్వజం

ప్రజాశక్తి-గుడ్లూరు: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ సరఫరా లో తీవ్ర అంతరాయం కలుగుతుందని సరఫరా లో వోల్టేజ్ వలన రక్షిత నీటి పథకాలు సక్రమంగా పనిచేయకుండా పోతున్నాయి. దీని ఫలితంగా తాగునీరు గ్రామస్తులకి సజావుగా అందించలేక పోతున్నామని మండలంలోని చేవూరు, కర్లపాలెం, పరకంఠపాడు సర్పంచులు వెంకటేశ్వర్లు, చాపల రమణయ్య, విద్యుత్ అధికారులపై ధ్వజమెత్తారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వై.వెంకటేశ్వర్ రావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. కర్లపాలెంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ సరఫరా చేసేందుకు రెండు విద్యుత్ స్తంభాలు మంజూరు చేయాలని ఏడాదికాలంగా అధికారులకి విజ్ఞప్తి చేస్తున్న పట్టించుకోవడంలేదని సర్పంచ్ చాపల రమణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. పరకంఠపాడులో విద్యుత్ తీగలు కిందకి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని వీధిదీపాలకి డైరెక్ట్ కనెక్షన్ ఉన్నందున రాత్రి పగలు అన్న తేడా లేకుండా వీధి దీపాలు వెలగడం వలన పంచాయతీలపై అదనపు భారం పడుతుందని సర్పంచ్లు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తక్షణం పరిష్కారం చేయాలని ఎంపీడీఓ వై వెంకటేశ్వరరావు విద్యుత్ ఏఈ శ్రీనివాస రావు ని ఆదేశించారు. గృహాలకి సౌర పొలకాలు మంజూరు చేసేందుకు ఒక్కొక్క వినియోగదారుడు 20,000 చెల్లించి పేరు నమోదు చేసుకుంటే స్థానిక బ్యాంకులు వారు లోను మంజూరు చేస్తారని 79,000 సబ్సిడీతో సౌరు పొలకాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. మండలంలో ఇంతవరకు ఎనిమిది గ్రామాల్లో రీ సర్వే చేయడం జరిగిందని రీ సర్వే వేగంగా చేయాలని 150 మంది రైతులు వినతి పత్రాలు అందజేసి ఉన్నారని తహశీల్దార్ సభకు తెలిపింది. ఏఓ రవికుమార్ ఏపీఓ అబ్దుల్ పశుసంవర్ధక ప్రతినిధి గోవర్ధన్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సాగర్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ

8వేల సర్వీసులకు స్మార్ట్ మీటర్స్ ఏర్పాటు

ప్రజాశక్తి -నెల్లూరు : జిల్లాలో స్పాట్ స్మార్ట్ మీటర్ల ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందని జిల్లా సూపరింటెండింగ్ ఇంజినీర్ వి.విజయన్ తెలిపారు. శుక్రవారం విద్యుత్ భవన్ లో మీడియాతో మాట్లాడుతూ వినియోగదారులు స్మార్ట్ మీటర్లకు ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదని తెలిపారు .ఈ స్మార్ట్ మీటర్లను డిపార్ట్మెంట్ వారే బిగిస్తారని తెలియజేశారు. వినియోగదారులు ఎటువంటి అపోహలకు లోను కావద్దని, ఎటువంటి రుసుము మీ దగ్గర వసూలు చేయమని ఇది పూర్తిగా డిపార్ట్మెంట్ వారే మీటర్లను బిగిస్తారని కాబట్టి ఈ విషయంలో ఎటువంటి సందేహం పడవద్దు అని తెలియజేశారు. ఈ స్మార్ట్ మీటర్ల వల్ల చాలా ఉపయోగం ఉందన్నారు. ఈ స్మార్ట్ మీటర్ నెల చివరి రోజు అనగా 30వ తేదీ కానీ 31వ తేదీ కానీ అర్ధరాత్రి 12 గంటలకు ఎంత రీడింగ్ ఉన్నదో అదే రీడింగ్ తో బిల్లింగ్ జరుగుతుందని తెలిపారు. మొదటి వారంలో ఎప్పుడు రీడింగ్ తీసిన ఫైనల్ రీడింగ్ 31వ తేదీ అర్ధరాత్రి రికార్డ్ అయిన రీడింగ్ తోనే బిల్లింగ్ జరుగుతుందని తెలిపారు. 200 యూనిట్లు దాటిన వారికి కూడా బిగిస్తున్నామని తెలియజేశారు.

మాట్లాడుతున్నఎస్ఇ విజయన్

కల్వర్టులోకి దూసుకెళ్లిన కారు, బైక్

-తీవ్రంగా గాయపడ్డ ప్రయాణికులు

ప్రజాశక్తి-నెల్లూరు: నగరంలోని మినీ బైపాస్ రోడ్డు, టిడిపి జిల్లా కార్యాలయానికి కూతవేటు దూరంలో అతివేగంగా ప్రయాణిస్తున్న కారు, బైకు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారు, బైక్ నడుపుతున్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన చూసిన స్థానికులు గాయపడ్డవారిని హుటాహుటిన వైద్య చికిత్సల నిమిత్తం ప్రయివేట్ ఆసుపత్రులకు తరలించారు. వేగంగా వస్తున్న కారు ప్రమాదాన్ని నియంత్రించే క్రమంలో కారుకు బ్రేక్ వేయపోయి పొరపాటున ఎక్స్‌లేటర్ పై కాలు పెట్టడం ప్రధాన కారణంగా స్థానికులు బావిస్తున్నారు. రోడ్డు పక్కనే ఉన్న కల్వర్టుకు కనీసం రక్షణ గోడ లేకపోవడమే ప్రధాన కారణంగా పలువురు మాట్లాడుకుంటున్నారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

డ్రైయినేజీ పనుల పరిశీలన

ప్రజాశక్తి-కందుకూరు: మండలంలోని మాచవరం ఎస్టీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న అండర్ గ్రౌండ్ పైప్ లైన్ పనులను మండల ఏఈ షేక్ నాయబ్ రసూల్, ఆర్డబ్ల్యూఎస్ అండ్ ఎస్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ ఎం రమణయ్య పరిశీలించారు. పనుల నాణ్యతను వారు పరిశీలించారు.

జిల్లాస్థాయి తైక్వాండో సబ్ జూనియర్ బాలబాలికల ఎంపిక పోటీలు

ప్రజాశక్తి-కందుకూరు: జడ్పీహెచ్ గర్ల్స్ హై స్కూల్ ఆవరణలో ఈనెల 10తేదీ ఆదివారం జిల్లా స్థాయి తైక్వాండో సబ్ జూనియర్ బాల బాలికల ఎంపిక పోటీలు నిర్వహించబడునని ప్రకాశం జిల్లా తైక్వాండో కార్యదర్శి ఎస్.డి.అబ్దుల్ సలాం తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు పాల్గొనవలసినదిగా కోరారు..పాల్గొనే క్రీడాకారుల వయసు 7 నుంచి 11ఏళ్ల లోపు ఉండాలి. క్రీడాకారులు వారి ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ సర్టిఫికెట్‌ను తీసుకు రావలెను .ఈ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు ప్రకాశం జిల్లాలో కందుకూరులోని ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజ్ ఆవరణలో జరగబోవు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు. మరిన్ని వివరములకు సంప్రదించాల్సిన నెంబర్ 8686240540

సచివాలయంలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-సైదాపురం : మండల పరిధిలోని చాగణం రాజపాలెం. సచివాలయంలో ఎంపిడిఒ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్నటువంటి హౌస్ హోల్డ్ సర్వే కు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. తిప్పిరెడ్డిపల్లి పంచాయతీలో జరుగుతున్నటువంటి ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలకు దిశా నిర్దేశం చేశారు.

మండల మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ముత్తుకూరు

సిపిఎం మండల మహాసభ ఈనెల 10వతేదీ ఆదివారం స్థానిక శ్రామిక భవన్‌లో జరుగునని ఆ పార్టీ మండల కార్యదర్శి గడ్డం అంకయ్య శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా సిపిఎం జిలా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు, గోగుల శ్రీనివాసులు పాల్గొంటారని తెలిపారు. మండలంలోని సిపిఎం శాఖాసభ్యులు, కార్యదర్శులు, మండల కమిటీ సభ్యులు పాల్గొని మహాసభను జయప్రదం చేయాలని కోరారు.

చేవూరులో పొలంబడి

ప్రజాశక్తి-గుడ్లూరురూరల్

మండలంలోని చేవూరు గ్రామంలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు గ్రామ రైతులకు పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి గుడ్లూరు బి. రవికుమార్ అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు పి. అనసూయ మాట్లాడుతూ పొలంబడి 14 వారాలు శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు. రైతులు అన్ని వారాలు హాజరై సాగుబడిలో పద్ధతులను పాటించి మేలైన, అధిక దిగుబడులు సాధించాలని తెలిపారు.

గిరిజనులకు సంక్షేమ ఫలాలు అందాలి

రాష్ట్రంలో తొలిసారి గిరిజనుల గ్రీవెన్స్ డే-సోమిరెడ్డి

ప్రజాశక్తి-వెంకటాలచం

ప్రభుత్వ సంక్షేమ ఫలాలు గిరిజనుల అందేలా కృషిచేయాలని సర్వేపల్లె ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చెముడుగుంట సమీపంలోని శ్రీడ్స్ కల్యాణ మండపంలో గిరిజనుల ప్రత్యేక ప్రజా విజ్ఞాపనల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజక వర్గంలోని గిరిజనుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపి రాష్ట్రంలోనే సర్వేపల్లి నియోజక వర్గాన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా సర్వేపల్లి నియోజకవర్గంలో గిరిజనుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రత్యేక ప్రజా విజ్ఞాపనల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. గిరిజనులకు అన్ని సంక్షేమ పథకాలు అందించడమే ఈ కార్యక్రమ ప్రధాన చెప్పారు. ఆధార్ కార్డులు, జనన ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులు తదితర ధ్రువీకరణ పత్రాలు లేని గిరిజనులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసి కేంద్ర రాష్ట్ర సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తామన్నారు. గిరిజనుల జీవన ప్రమాణాలు పెంచి పేదరికం నుంచి ఆయా కుటుంబాలు బయటపడేందుకు విద్య, సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పనకు అన్ని చర్యలు చేపట్టేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ఎస్‌సి, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను కూడా పక్కదారిపట్టించి గిరిజనులకు మొండిచెయ్యి చూపిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రుణ రాయితీ పథకాలను కూడా అమలుచేయలేదని మండిపడ్డారు. అమాయక గిరిజనుల భూములను కూడా పెద్ద ఎత్తున ఆక్రమించేశారని, ఫ్రీ హోల్డ్ పేరుతో అనేక అక్రమాలకు పాల్పడ్డారని, వీటన్నిటిపై విచారించి గిరిజనులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. పారిశ్రామిక వేత్తలు, దాతలు, మిత్రుల సహాయ సహకారాలతో సర్వేపల్లి నియోజకవర్గంలో అత్యంత పేదరికంలో మగ్గుతున్న గిరిజన కుటుంబాల ఆర్థిక పరిపుష్టికి కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారుఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కలెక్టర్ ఆనంద్, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సూర్య తేజ, జిల్లా, మండలస్థాయి అధికారులు హాజరై గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. సర్వేపల్లి నియోజకవర్గం 5 మండలాల నుంచి గిరిజనులు భారీగా తరలివచ్చారు. గిరిజనుల అర్జీలు ఆన్ లైన్ నమోదు కోసం 15 ప్రత్యేక కౌంటర్లు, ఆధార్ కార్డుల నమోదు కోసం ఐదు ప్రత్యేక కౌంటర్లు, 25మంది సచివాలయ ఉద్యోగులతో హెల్ప్‌డెస్క్ ఏర్పాటుచేశారు.
కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పరిమళ, డ్వామా, ఐసిడిఎస్ పీడీలు గంగాభవాని, హేనాసుజన్, వ్యవసాయాధికారి సత్యవాణి, జిల్లా వైద్యాధికారి పెంచలయ్య, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్‌శాఖల ఎస్ఇలు అశోక్‌కుమార్, వెంకటరమణ, విజయన్, మత్స్యశాఖ జెడి నాగేశ్వరరావు, ఎపిఎంఐపి పీడీ శ్రీనివాసులు, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సుబ్బారెడ్డి, ఎంపిడిఒ కల్పన, తహశీల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో ఎంఎల్ఎ సోమిరెడ్డి

వ్యవసాయం అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-నెల్లూరు: విభజిత నెల్లూరు జిల్లా జిడిపి కేవలం వ్యవసాయం ద్వారా మాత్రమే పెరిగే అవకాశం ఉన్నందున, వ్యవసాయ రంగంలో అభివృద్ధికి సిడ్బి కృషి చేయాల్సిందిగా కలెక్టర్ ఒ. ఆనంద్ కోరారు. శుక్రవారం నగరంలోని ప్రయివేట్ హోటల్లో ఎంఎస్‌ఎంఇ క్లస్టర్ అవుట్ రీచ్ ప్రోగ్రామ్ ను సిడ్బి (ఎస్‌ఐడిబిఐ) స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటుచేసిన మూడు క్లస్టర్లు ఆశాజనక పురోగతిలో లేనందున, వాటి ఉత్పత్తిని పెంచే విధంగా, ఆర్థిక వృద్ధికి సిడ్బి ఇతోధికంగా తోడ్పడా లన్నారు. సిడ్బి స్కీమ్ లో ఉన్న వారందరికీ ఆర్థిక సహాయం అందించడం, మెరుగైన మార్కెట్ వ్యూహాలను గుర్తించడం, తద్వారా వారి అవకాశాలను పెంచాలన్నారు. మంచి వ్యాపారవేత్తలకు సీడ్ క్యాపిటల్, వ్యాపారాన్ని నిలబెట్టుకోవడం కోసం సాఫ్ట్ లోన్‌లు అందిస్తుందన్నారు. సమావేశంలో సిడ్బి ప్రతినిధి సురేష్, డిఐసి ఎడి శ్రీనివాస్, ఎంఎస్‌ఎంఇ ప్రతినిధులు, పాల్గొన్నారు.

అట్రాసిటీ చట్టంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని పొంగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా నేర పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అట్రాసిటీపై అవగాహన సదస్సు ను నిర్వహించారు. సిఐడి డి.ఎస్.పి. కోటారెడ్డి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర డిజిపి, అడిషనల్ డిజిపి ఆదేశాల మేరకు ఈ వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఆత్మకూరు డిఎస్పి వేణుగోపాల్, సిఐ గంగాధర్, సిఐడి సిఐ బాలకృష్ణ, తహశీల్దార్ అనిల్‌కుమార్ యాదవ్, ఎంఇఒ ధనలక్ష్మి, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ హనుమంతు, ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, కేతుకొండ సర్పంచ్ హరితేజ, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-కావలి : డి.బి.ఎస్. ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజులుగా జరిగిన అంతర్ జిల్లా స్థాయి అండర్-19 కబడి పోటీలలో మూడవ రోజు అయిన శుక్రవారం ఫైనల్ పోటీలలో ఈస్ట్ గోదావరి, శ్రీకాకుళం జట్ల మధ్య ఉత్కంఠ భరితంగా సాగిన పోరులో విజేతగా ఈస్ట్ గోదావరి జట్టు గెలిచింది. మొత్తం13 జిల్లాల జట్లు మూడు రోజుల పాటు ఆడగా ఫైనల్‌లో రెండు జిల్లాల మధ్య పోటీ నెలకొంది. ఫైనల్ విజేతగా ఈస్ట్ గోదావరి జిల్లా నుండి విజయ కేతనం ఎగరేశారు. ఈ పోటీలలో మొదటి విజేతగా ఈస్ట్ గోదావరి, రెండో విజేతగా శ్రీకాకుళం, మూడవ విజేతగా నెల్లూరు జట్టు గెలుపొందారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన డి.బి.ఎస్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ దామిరెడ్డి శ్రీనివాస నాయుడు వారిని అభినందించారు. డి.బి.ఎస్. ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ దామిరెడ్డి సుధీర్ నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టివి రావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి.రమేష్ బాబు, డి.వి.ఇ.ఒ. మధుబాబు, ఆర్ఐఒ ఒ.శ్రీనివాసులు, స్టేట్ కబడ్డీ అబ్జర్వర్, గంగాధర్, జిల్లా అండర్-19ఆర్గనైజింగ్ సెక్రెటరీ డి.శరీఫ్, డివిఇఒ రాజు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ, వై.సత్యనారాయణ, జెడిపిహెచ్ఎస్ స్కూల్ చిరంజీవి పిడి, డి.బి.ఎస్. ఇంజినీరింగ్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శివసాగర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-ఉదయగిరి : మండలంలోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ శాఖ అధికారి ఆంజనేయులు నాయక్ ఆధ్వర్యంలో ఇంటర్నల్ స్క్వాడ్ వింజమూరు వ్యవసాయ శాఖ సహాయక సంచాలకులు ఎస్.రామిరెడ్డి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఇంటర్నల్ స్క్వాడ్ ఎడిఎ రామిరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి ఆంజనేయ నాయక్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు సరసమైన ధరలకు ఇవ్వాలని అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. అనంతరం ఇన్వాయిస్ స్టాక్ రిజిస్టర్ బిల్లుబుక్కులను పరిశీలించారు. డీలర్లు స్టాక్ అమ్మిన వెంటనే తప్పనిసరిగా బిల్లులను రైతులకు ఇవ్వాలన్నారు. వీరివెంట దుత్తలూరు ఎఒ సుబ్బారెడ్డి, మర్రిపాడు ఎఒ ఎస్ రామాంజనేయులు, వరికుంటపాడు ఎఒ వి.రవికుమార్ పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో టిడిపి నాయకులు పలు వార్డులలో టిడిపి సభ్యత్వ నమోదు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. స్థానిక 4వ వార్డు జెఆర్ పేటలో నాయకులు దాసరి మధుసూదన్ రావు ఆధ్వర్యంలో టిడిపి సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి ప్రజలకు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను గురించి వివరించారు. ఆయనవెంట నాయకులు దాసరి బాలకృష్ణ, బివిఎస్ మునగాల వెంకటయ్య తదితరులున్నారు. అదే విధంగా 20వ వార్డులో టిడిపి సీనియర్ నాయకులు చండ్రా వెంకట సుబ్బానాయుడు, కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదును నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు యువత మాజీ ఉపాధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, చెరుకూరు శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సందర్శన

ప్రజాశక్తి-అనంతసాగరం : బెడుసుపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ పద్మావతి శుక్రవారం సందర్శించి పిల్లల ఎదుగుదల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు గుడ్డు, పాలు, కేంద్రంలో వండిపెట్టే పౌష్టికాహారం తినడం వల్ల పిల్లలో ఎదుగుదల బాగా ఉంటుందన్నారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌లో ఉండే పిల్లల బరువులు, ఎత్తులు తీసుకున్నారు. బాలింతలు, గర్భిణులు, అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే పౌష్టిక ఆహారంతో పాటు ఆకుకూరలు లాంటివి తీసుకోవడం వల్ల వారిలో రక్తహీనత సమస్య లేకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ సునీత, ఆయా ధనమ్మ పాల్గొన్నారు.

16న చెరువు వేలం

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని పాతాళపల్లి చెరువు బహిరంగ వేలం 16వ తేదీన నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ బిజిలీమల ఓబుల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 6న చెరువు వేలం పాట జరగాల్సి ఉండగా ఎవరూ పాల్గొనకపోవడంతో వాయిదా వేశామన్నారు. 16న పాతాళపల్లి సచివాలయంలో మధ్యాహ్నం మూడు గంటలకు వేలంపాట జరుగుతుందన్నారు.

అథ్లెటిక్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి-అనంతసాగరం : ఏలూరు జిల్లా కైకరంలో 6, 7తేదీలలో జరిగిన 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 అథ్లెటిక్ పోటీలలో 80 మీటర్ల హర్డిల్స్ విభాగంలో జెడిపిహెచ్ఎస్ అనంతసాగరం హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న షేక్ మాహీన్ తన అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. డిసెంబర్‌లో జార్ఖండ్‌లో జరిగే జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీలలో ఈమె పాల్గొంటుంది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం బట్రెడ్డి లక్ష్మీ ప్రసన్న, పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు అబ్దుల్ గఫార్, రజియా విద్యార్థి సాధించిన విజయానికి ఆమెను అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, పాఠశాల టీచర్ల ప్రోత్సాహంతోనే తను ఈ విజయం సాధించిందని విద్యార్థి పేర్కొంది.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి-వరికుంటపాడు : గ్రామాలలో ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కందుకూరు సబ్ కలెక్టర్ పూజ అన్నారు. శుక్రవారం మండలంలోని దక్కునూరులో వివాదాస్పదంగా ఉన్న భూమిని ఆమె పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో ఎక్కడా కూడా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని తహశీల్దార్ హేమంత్ కుమార్‌కు సూచించారు. అన్యాక్రాంతమైన వివాదాస్పద భూములలో నిషేధిత బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. తూర్పు కొండారెడ్డిపల్లిలో 694 సర్వే నెంబర్‌లో వివాదాస్పదంగా ఉందని చెప్పే స్థానికులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ యశ్వంత్, సిబ్బంది పాల్గొన్నారు.

అలసత్వంపై ఎంఎల్‌ఎ ఆగ్రహం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : ప్రభుత్వ గృహ నిర్మాణాలు పూర్తి చేయకుండా నిధులు డ్రా చేసుకొని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కొంతమంది అధికారులు, గుత్తేదారుల పై ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశానికి ఆమె విచ్చేశారు. ఈ సమావేశానికి గైర్హాజరైన వైద్యాధికారులు ఇతర అధికారులపై మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీహరి, ఎంపిపి శ్రీనివాసులు, తహశీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు, సూరా శ్రీనివాసులు రెడ్డి, టౌన్ కన్వీనర్ ఎన్ వి శేషయ్య, రూరల్ కన్వీనర్ బత్తల హరికృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పనబాక దంపతులకు సన్మానం

ప్రజాశక్తి-ఉదయగిరి : తిరుమల తిరుపతి దేవస్థాన పాలక మండలి సభ్యురాలిగా బాధ్యతలు స్వీకరించిన కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, సీనియర్ టిడిపి నాయకులు పనబాక కృష్ణయ్య దంపతులను టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ మాజీ జెడ్‌పి చైర్మన్ పి.చెంచలబాబు యాదవ్ శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం తిరుమల తిరుపతిలో పనబాక దంపతులను స్వీకరణ ఆలయ సాంప్రదాయం ప్రత్యేక పూజలు ఆయన పాల్గొన్నారు. వారి దంపతులను శాలువాతో మొమెంటోతో ఘనంగా సత్కరించి వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు వారికి ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం టిటిడి చైర్మన్ బి.ఆర్.నాయుడును కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ సునకమ్మ, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, సీనియర్ టిడిపి నాయకులు దేవ నారాయణ రెడ్డి, వేణు, సతీష్ రెడ్డి, శివప్రసాద్, జహంగీర్, సుమన్, భారీ సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజాపోరుయాత్ర

మర్రిపాడులో...

ప్రజాశక్తి-మర్రిపాడు
సిపిఎం కేంద్ర కమిటీ పిలుపుమేరకు బస్టాండ్ సెంటర్లో ప్రజా సమస్యలపై ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్తు ట్రూఅప్ ఛార్జీలు ప్రభుత్వ భరించాలని, ఉచిత ఇసుకను అమలు చేయాలన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువులతో నియంత్రించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు భర్తీ చేసి నిరుద్యోగ భృతిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నం ప్రయివేటీకరణ ఉద్యోగుల తొలగింపును విరమించుకోవాలన్నారు. మహిళలు మైనారిటీలు దళితులపై దాడులు అత్యాచారాలను అరికట్టాలని, పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించి ప్రాజెక్టును తురధిగతన పూర్తి చేయాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే జమిలీ ఎన్నికల ప్రతిపాదన విరమించుకోవాలన్నారు. కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్‌ను వెంటనే పునరుద్ధరించి సోమశిల హైలెవల్ కెనాల్ పనులకు బడ్జెట్లో నిధులు కేటాయించాలని, రామాయపట్నం పోర్టిపల్లి వెంటనే పూర్తిచేసి కార్యకలాపాలు ప్రారంభించి నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి ఎస్‌డి రహంతుల్లా, సిఐటియు మండల కార్యదర్శి బి రత్నయ్య, సీనియర్ నాయకులు సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కావలిలో...

ప్రజాశక్తి - కావలి : సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం పట్టణంలో 22వ వార్డులో "ప్రజా సమస్యలపై ప్రజా భేరి" కార్యక్రమాన్ని సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థలు ప్రయివేటీకరణను ఆపాలని కోరారు. ముఖ్యంగా విశాఖఉక్కు ప్రయివేటీకరణ ఆపాలని అందులో ఉద్యోగుల తొలగింపు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు వై.కృష్ణ మోహన్, బి.కృష్ణయ్య, నాయకులు సిపిఎం సీనియర్ నాయకులు పసుపులేటి తిరుపాలు, నాయకులు వి.బాబురావుతో పాటు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండల పరిధిలోని దర్గా సెంటర్ నుంచి సిపిఎం నాయకులు ప్రతి ఇల్లు తిరుగుతూ నిత్యావసర ధరలు, విద్యుత్ ట్రూఅప్ ఛార్జీల పెంపు, బెల్టు షాపుల రద్దు, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గింపు, గురించి మాట్లాడారు. నిత్యావసర

ఎఎస్‌పేటలో..

సరుకులైన కందిపప్పు, చింతపండు, బెల్లం, ఉప్పు, నూనె, కూరగాయల ధరలు తదితర వస్తువుల రేట్లు కొండెక్కాయాయని తద్వార పేద ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. తదితర సమస్యలను ప్రస్తుత ప్రభుత్వం తీర్చే విధంగా నవంబర్ 14న సిపిఎం ప్రజాపోరు పేరుతో తహశీల్దార్ కార్యాలయాల్లో నిరసన తెలియజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మీపతి, సిపిఎం మాజీ కార్యదర్శి సయ్యద్, ఆవాస్ కమిటీ నాయకులు గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జలదంకిలో..

ప్రజాశక్తి-జలదంకి : మండలంలోని జమ్మలపాలెం గ్రామంలో శుక్రవారం ప్రజాపోరుయాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు తాళ్లూరు మాల్యాద్రి, ప్రాంతీయ కమిటీ సభ్యులు అడపాల సురేష్, కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు కె.జాన్, గ్రామ వ్యకాసం నాయకులు అల్లాబాషా, మహిళా సంఘం నాయకులు పులుసు కోటేశ్వరమ్మ, బుజ్జమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోవూరు : విద్యుత్ సంస్కరణల

కోవూరులో...

పేరుతో ఆదానీ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా ప్రతి ఇంటికి విద్యుత్ స్మార్ట్ మీటర్లని బిగిస్తోందని వాటిని వెంటనే ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జొన్నలగడ్డ వెంకమరాజు డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై శుక్రవారం గంగవరం పంచాయతీ పరిధిలో ప్రజాపోరు యాత్రను నిర్వహించారు. గండవరపు శేషయ్య, బుజ్జియ్య, పెద్దబ్బయ్య, బాబు, శ్రీని వాసులు, అప్రోజ్, సర్దార్, రమేష్, మల్లికా ర్జున రెడ్డి, సురేష్, విజయ్, ఫాతిమ, రత్నమ్మ, చిన్నమ్మ, హరి, జానికిరాం, వెంకటేష్, యు వి రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కొడవలూరు : సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గోనె దయాకర్ ఆధ్వర్యంలో నార్త్ రాజుపాలెంలో శుక్రవారం ప్రజాపోరు యాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు అన్యాయం

- విద్యుత్ డిఇకి రైతుసంఘం వినతి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్
ఆత్మకూరు పట్టణంలో వినియోగదారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అదాని సంస్థ ద్వారా స్మార్ట్ మీటర్స్ బిగించడం అన్యాయమని ఎపి రైతుసంఘం నాయకులు లక్కు కృష్ణప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని విద్యుత్ డిఇ కార్యాలయంలో డి.శ్రీనివాసులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్కు కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ మీటర్లకు ప్రజలు నగదు చెల్లించి తీసుకున్నారని ప్రస్తుతం ఆ మీటర్లకు విద్యుత్ సిబ్బంది తీసుకుని స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని విడతల వారీగా నగదు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. దాంతో మరింతభారం పడే అవకాశాలు ఉన్నాయని ఆత్మకూరులో పట్టణంలో వినియోగదారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అదానీ సంస్థ ద్వారా స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని ఇది చాలా అన్యాయమన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించడం తక్షణమే మానుకోవాలన్నారు. ఆయనవెంట సుబ్బారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి ఉన్నారు.

సంక్షేమాల కోసం నిధులు కేటాయించాలి

వినతిపత్రం అందజేస్తున్న ఆవాజ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.రషీద్

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం
రాష్ట్రంలోనీ ముస్లిం మైనారిటీల అభివృద్ధికి ఎన్నికల హామీలలో భాగంగా కూటమి ప్రభుత్వం చెప్పిన హామీలను అమలు చేసేందుకు తగినన్ని నిధులు ఈ బడ్జెట్లో కేటాయించాలని ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ పిలుపులో భాగంగా ఆవాజ్ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మండల డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా షేక్.రషీద్ మాట్లాడుతూ ఎన్నికల హామీలలో భాగంగా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కూటమి నాయకులు ముస్లిం మైనారిటీల అభివద్ధి కొరకు విదేశీ విద్య, దులహన్ పథకం రూ.లక్ష వరకు అమలు, రూ.5లక్షల వరకు మైనారిటీ సబ్సిడీ లోన్లు, ఇమామ్, మౌజనులకు ప్రతినెలా జీతాలు ఇవ్వడం వంటి హామీలు ఇంతవరకు అమలు కాలేదని గుర్తు చేశారు. ఈ బడ్జెట్లో వాటికి నిధులు కేటాయించి సంక్షేమ పథకాలన్నీ అమలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే కేంద్రం ఏర్పాటు చేయనున్న వక్ఫ్‌చట్ట సవరణకు వ్యతిరేకంగా రాష్ట్ర శాసనసభలో కూడా తీర్మానం చేయాలని అప్పుడే రాష్ట్రంలో ఉన్న ముస్లిములకు భరోసా ఇచ్చినట్టు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ జానీబాషా, బుచ్చిరెడ్డిపాలెం మండల అధ్యక్ష, కార్యదర్శులు షేక్ జక్రియ, షేక్ మునీర్, సభ్యులు షరీఫ్, గౌస్ బాషా, అల్లాబక్షు, షబ్బీర్, షఫీ, ఖాళీ రసూల్, నాగూర్ బాషా, నజీర్ భాషా, తదితరులు పాల్గొన్నారు.



ఎఎస్‌పేటలో...

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో ప్రధానంగా మైనారిటీ విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం ఇతర దేశాల్లో చదువుకునేందుకు విదేశీ విద్య పథకం అమలు చేయాలని సిపిఎం నాయకులు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుల్హన్ పథకం ద్వారా పేద ముస్లింలకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం చేస్తామన్న హామీని నెరవేర్చాలని కోరారు. రానున్న బడ్జెట్ సమావేశాల్లో ఈ కేటాయింపులు జరిగేలా చూడాలని మండల కమిటీ నాయకులు గౌస్‌బాషా, మండల సిపిఎం కార్యదర్శి మొగల్ నిసార్ అహ్మద్, మాజీ కార్యదర్శి అస్లాం, సిఐటియు మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆత్మకూరు ఆవాజ్ మండల కమిటీ మండల కార్యదర్శి పి.యస్థాని బాషా అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆత్మకూర్ ఆవాజ్ మండల కమిటీ ఆధ్వర్యంలో మెయిన్ బజార్ (జ్యువెలరీ ఏరియా) నుండి పాతబస్టాండ్, బిఎస్ఆర్ సెంటర్ మీదుగా, ఎంఆర్ఒ, ఆర్‌డిఒ, ఆఫీసుల వరకు భారీ నిరసన ప్రదర్శన చేసి కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఆవాజ్ మండల కమిటీ సభ్యులు, పి.మస్తాన్, ఎస్‌డి ఖలీల్, ఎస్‌కె షరీఫ్, ఎస్‌కె.ఖలీల్, అల్లా బకష్, ఎస్‌కె ఇస్మాయిల్, పి.సల్మాన్ ఖాన్, ఎస్‌కె.ఖాజా రహమతుల్లా, ఎస్‌కె.నాయబ్, ఆవాజ్ గౌరవాధ్యక్షులు ఎం.నాగేంద్ర, మండల పరిధిలోని, పది మసీదులకు సంబంధించిన, ఇమామ్, మౌజన్, ముతవల్లీలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : ఎన్నికల సందర్భంగా ముస్లిం మైనారిటీలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఆవాజ్ అనంతసాగరం మండల కమిటీ ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆవాజ్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె సలీం, ఎస్‌డి ఇఫ్తిఖర్ ఆవాజ్ నాయకులు సుభహాని మాట్లాడారు. గత ఆరు నెలల నుండి మసీదులో ఉండే ఇమామ్, మౌజన్‌లకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం ఇవ్వడం లేదని, ఎన్నికలో ఇచ్చిన హామీలలో దుల్హన్ పథకం అమలు చేయాలని మైనారిటీ కార్పొరేషన్ నుండిరూ రూ.5లక్షల సబ్సిడీ లోన్‌లు ఇవ్వాలని, చదువుకొనే విద్యార్థులకు ఉపకార వేతనాలు విడుదల చేయాలని, మసీదులో, ముస్లిం శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఉన్నత విద్య చదువుకొనే వారికి విదేశీ విద్య అవకాశం కల్పించాలనీ కోరారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ నాయకులు సూఫీయాన్, బాబు, అన్వర్, అరిఫ్, ఖాసిం, ఖాజాగరిబ్, షామీర్, తదితరులు పాల్గొన్నారు.

అనంతసాగరంలో..

మర్రిపాడులో...

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని ముస్లిం మైనారిటీల సమస్యలను పరిష్కరించాలని ఇన్‌ఛార్జ్ తహశీల్దారు అనిల్‌కుమార్ యాదవ్‌కు మండల ఆవాజ్ కమిటీ ఉపాధ్యక్షులు రహంతుల్లా వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. మాయాతి విద్యార్థులకు విదేశీ విద్య పథకం పేద ముస్లిములకు దుల్హన్ పథకం కింద లక్ష రూపాయలు ఆర్థిక సహాయం, 50యేళ్లకే పెన్షన్ సదుపాయం కల్పిస్తామన్నారు. ఆరు నెలలుగా పెండింగ్లో ఉన్న ఇమామ్ మౌజం జీతాలు వెంటనే విడుదల చేయాలని, మసీదులు కబరుస్తాన్, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కోసం నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ సభ్యులు సహిత్ కాలేషా, షేక్ మహబూబ్ సాహెబ్, మహబూబ్ దాదా, షేక్ అబ్దుల్లా, ఇమామ్ వస్తాద్ పాల్గొన్నారు.

'ఉపాధి' సిబ్బందితో సమీక్ష

ప్రజాశక్తి-ఉదయగిరి
ఉపాధి హామీ పథకం సిబ్బందితో శుక్రవారం ఎంపిడిఒ అప్పాజీ, ఎపిఒ శ్రీనివాసులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని స్త్రీశక్తి భవన్ లో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బంది సమీక్షలో వారు మాట్లాడారు. మండలంలో 23 మినీ గోకులాలు మంజూరయ్యాయని వాటి పనులు కోసం కార్యాచరణ రూపొందించాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా పల్లె వనం, చెక్ డ్యామ్‌లో పూడికతీత, ఇంకుడు గుంతలు, హార్టికల్చర్, హౌసింగ్ పలు కార్యక్రమాల్లో సిబ్బంది లక్ష్యాలను సాధించాలన్నారు. ఎప్పటికప్పుడు వారి ఇచ్చిన లక్ష్యాలను చెరువు కావాలన్నారు. ముఖ్యంగా ప్రతి గ్రామంలో ఉపాధి పనులు కోరిన ప్రతిఒక్కరికీ పనులు కల్పించి పనులకు తగ్గట్టు కూలీలు అందించాలన్నారు. సిబ్బంది అలసత్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెం ట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు పాల్గొన్నారు.

ఉదయగిరిలో...

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండల పరిధిలోని ఎన్ఆర్ఇజిఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపిడిఒ ప్రసన్నకుమారి మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలు ఎక్కువగా పనులకు వచ్చే విధంగా వారి సంఖ్యను గణనీయంగా పెంచాలని, గ్రామాల్లోని ప్రతి కుటుంబంలో ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకునే విధంగా, రైతులు పశువులకు షెడ్లను ఏర్పాటు చేసుకోవాలని వాటికి సంబంధించిన ఉపాధి హామీ పథకం కింద నిధులు సమకూరుస్తామని ఆమె తెలియజేశారు. సమావేశంలో మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'శ్రీ చైతన్య' విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-కావలి : పులివెందుల వైఎస్ఆర్ స్పోర్ట్స్ అకాడమీలో 7న ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో జరిగిన అండర్-19 సాఫ్ట్ టెన్నిస్‌లో కావలి శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థి పి.సాయితేజరెడ్డి పాల్గొని రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానం సాధించారు. ఈ సందర్భంగా కళాశాల అభినందన సభలో కళాశాల కరస్పాండెంట్ ఎస్.వెంకయ్య, డైరెక్టర్స్ పివిఎస్ ప్రసాద్, ఎం.కొండయ్య, కళాశాల గౌరవ సలహాదారు నందనవనం మధుసూదన్ రావు, కళాశాల ప్రిన్సిపాల్ టివి.లుకోథర్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కె.వెంకటేశ్వర్లు విద్యార్థిని ఘనంగా అభినందించారు.

వేలం ప్రకటన

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, గుడ్లూరు మండలం పొట్లూరు గ్రామపంచాయతీ నందు గల పెద్ద చెరువు మరియు చిన్న చెరువులలో చేపలు పెంచుకొనుటకు 01-07-2024 నుండి 30-06-2025 వరకు (ఒక సంవత్సర కాలము వరకు మాత్రమే) వేలం పాట జరుపబడును. తేదీ 16-11-2024 న ఉదయం 11.00 గంటలకు పొట్లూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహించబడును. వేలం పాటలో పాల్గొనదలచిన వారు రూ రూ 5000/- ధరావత్తు చెల్లించి పాల్గొనవచ్చును. వేలంలో పాల్గొన్న హెచ్చు పాట దారునకు చెరువులో చేపలు పెంచుకొనుటకు అనుమతించబడును. ఇతర వివరములకు పొట్లూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి గారిని అడిగి తెలుసుకొనవచ్చును.

ఇట్లు
సిహెచ్.లక్ష్మీలత
పంచాయతీ కార్యదర్శి,
పొట్లూరు గ్రామపంచాయతీ,
గుడ్లూరు మండలం, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా.

పిఎఫ్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

ప్రజాశక్తి-వింజమూరు : ఉపాధ్యాయుల జనరల్ ప్రావిడెంట్ ఫండ్ వివరాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆన్‌లైన్‌లో ఉంచాలని యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ చెంచలబాబు యాదవ్ డిమాండ్ చేశారు. వింజమూరులోనే ప్రాంతీయ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ప్రతినెలా జిపిఎఫ్ ఖాతాలో ఉపాధ్యాయులు పెద్ద మొత్తంలో నగదు నువ్వు జమ్ము చేస్తున్నారని అయితే వడ్డీ గానీ అసలు గానీ జమ అయినది లేనిది తెలియడం లేదన్నారు. 2022 సంవత్సరం నుండి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేయాలన్నారు. యుటిఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వర్ రెడ్డి, వీరాంజనే యులు, నాయకులు పరమేశ్వర రావు, మీరావలీ, శివకుమార్, సుబ్బారావు, తదితరులున్నారు.

త్వరలోనే భవనానికి మరమ్మతులు



ప్రజాశక్తి-ఉదయగిరి : మండల అభివృద్ధి కార్యాలయా నికి మరమ్మతుల పనులను త్వరలోనే చేపడుతామని పంచాయతీరాజ్ కావలి ఇఇ వేణు గోపాల్ తెలిపారు. శుక్రవారం స్థానిక మరమ్మతులకు గురైన మండల అభివృద్ధి కార్యాలయాన్ని ఎంపిడిఒ అప్పాజీ, పిఆర్ఐ డిఇఇ సిహెచ్ మణికుమార్, ఎఇ శ్రీనివాసరాజులతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిథిలావస్థకు చేరుకొని ఉన్న భవనాలను పరిశీలించామని తమ సిబ్బంది ఏర్పాటు చేసిన మరమ్మతుల నివేదికలను కూడా పరిశీలించామని త్వరలోనే సంబంధిత ప్రతిపాదనలు పూర్తయ్యాయని సంబంధిత జిల్లా అధికారులకు పంపుతామన్నారు. వారి ఆమోదంతో త్వరలోనే నిర్మాణ పనులు నూతనంగా మరమ్మతులు చేపడతామన్నారు. వాటి పైకప్పు స్లాబ్ పెచ్చులు ఊడి పడిపోతున్నాయని వాటిని మాత్రమే రీ మోడలింగ్‌గా నూతన మరమ్మతులు చేపట్టేందుకు అంచనాలు వేసినట్లు తెలిపారు.

బెల్ట్‌షాపులపై ఎస్ఐ దాడులు

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని పొంగూరులో మద్యం బెల్ట్‌షాపుపై ఎస్ఐ శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడిలో బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న పాశం కృష్ణయ్యను అదుపులోకి తీసుకొని అతని వద్ద నుండి 26 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ లైసెన్స్ కలిగిన మద్యం షాపుల్లో మద్యం విక్రయించాలని బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిర్వహకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సేవలను వినియోగించుకోండి..

మాట్లాడుతున్న జడ్జీ ఎం.శోభ

ప్రజాశక్తి-కావలి : కావలి న్యాయస్థాన భవన సముదాయంలో శుక్రవారం జాతీయ న్యాయ సేవా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జీ ఎం.శోభ అధ్యక్షత వహించి మాట్లాడారు. సమస్యలకు పరిష్కార దిశగా న్యాయస్థానాలు పేద, గొప్ప అనే తేడాలు లేకుండా సేవలు అందిస్తున్నాయని తెలిపారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఇ.సుధాకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సురేంద్ర రెడ్డి, న్యాయవాదులు కెనడీ, లోక్ అదాలత్ మెంబర్ ఎం.మాలకొండా రెడ్డి, న్యాయవాదులు, సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ సిఐ ప్రసాద్‌రెడ్డి

అధిక రేట్లకు మద్యం విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట
మద్యం దుకాణదారులు ఎంఆర్‌పి ధర కంటే అధిక రేట్లకు అమ్మితే కట్టిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సిఐ జి వి ప్రసాద్ రెడ్డి తెలిపారు. మండలంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఆయన శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఇందుకూరుపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ముత్తుకూరు, తోటపల్లి గూడూరు, ఇందుకూరుపేట మండలాలోని 18మద్యం దుకాణాలలో ఎంఆర్‌పికి మించి అధిక రేట్లు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి మద్యం షాపు వద్ద ఎంఆర్‌పి ధరల ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేశామని తెలిపారు. అధికరెట్లకు అమ్మితే ఫ్లెక్స్ బోర్డులో ఏర్పాటు చేసిన ఫోన్ నెంబర్లకు తెలియజేయాలన్నారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటివరకు మూడు మండలాలకు గానూ ఏడు మద్యం కేసులు సీజ్ చేసినట్లు తెలిపారు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి గారి కోర్టులో

O.S.No.593/2019

పోతుల రవిచంద్రారెడ్డి, తండ్రి **రామ సుబ్బారెడ్డి,** వయస్సు 39 సం॥లు, హిందూ, వ్యాపారం, సాకిన్ డి.నెం.5/554, అప్‌స్టెయిర్స్, చౌడమ్మ గుడి ఎదురుగ, విజయనగరం వీధి, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా. - వాది

Vs

నారె హరిష్ కుమార్ రెడ్డి, తండ్రి **నారె సుధాకర్ రెడ్డి,** వయస్సు 40 సం॥లు, హిందూ, వ్యాపారం, సాకిన్ బాలాజీనగర్, నెల్లూరు సిటీ, ప్రస్తుతం సాకిన్ డి.నెం. 16-10-18, టి.డి.పి. పార్టీ ఆఫీసు ఎదురుగ, శ్రీహరి రెడ్డి నగర్, మిని బైపాస్ రోడ్డు, నెల్లూరు సిటీ, నెల్లూరు జిల్లా. - ప్రతివాది

ప్రతివాదికి దావా సమను

పై నెంబరు దావాను వాది దావా మొత్తం **రూ.7,31,333/-లు** (అక్షరాల ఏడు లక్షల ముప్పై ఒక్క వెయ్యి మూడు వందల ముప్పై మూడు రూపాయలు మాత్రము) రాబట్టుకొనుటకుగాను ప్రతివాది అయిన నీపైన దాఖలు చేసియున్నాడు. అట్టి దావా **తే 12-11-2024 దిన** వాయిదా ఉంటున్నది. పై దావాలో నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల **తే12-11-2024 దిన ఉదయం 10.30 గంటలకు** పై కోర్టు యందు హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనంతట నీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది: **12-11-2024**

ఎల్.గంగి రెడ్డి, బి.కాం., బి.ఎల్.,
అడ్వకేట్, ప్రొద్దుటూరు

IN THE COURT OF HON'BLE IV JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, KALPATARU, AT : HYDERABAD

D.V.C. No. 194 of 2024

Between:
Thota Jayasree @ Sunkara Jayasree and another
...Petitioners

AND

Thota Ranga Rao and another
...Respondents

To,
1. Thota Ranga Rao, S/o Thota Pullaiah, aged about 72 years, Occ: Retired Govt. Teacher, R/o 11. No 16/156, Madhwapathi vari Street, Nellore-I, SPSR Nellore District.
2. Thota Rukminamma, W/o Thota Ranga Rao, aged about 69 years, Occ: Business, R/o H.No 16/156, Madhwapathi vari Street, Nellore-1, SPSR Nellore District.
Respondents

The Petitioners filed the above case against you both U/s. 12 of D.V.C. Act and the said case stands posted on 20.11.2024 for your appearance in person or through duly appointed Advocate at 10:30 AM and if you fail to appear on the said date before the said court, the matter will be decided as per law.

(BY ORDER OF THE COURT)

Sd/- Nikhat Sajida
Advocate
H.No 2-4-638/9/2, Above Shifa Clinic, 3 Floor, Goods Shed Road, Sundernagar, Kachiguda, Hyderabad-27.